క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

నల్లజర్ల: అనంతపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అనంతపల్లి, చోడవరం, కృష్ణమ్మగూడెం ఫీడర్లలో గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు తెలిపారు. ఆయా ఫీడర్లలో త్రిఫేజ్ సరఫరా ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు సరఫరా చేయనున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మలకపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

తాళ్లపూడి: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మలకపల్లి ఇతర గ్రామాల్లో ఉన్న కేంద్రాలను అసిస్టెంట్ ఎలక్ట్రోల్ అధికారి, తహసీల్దార్ శ్రీనివాసరావు తన సిబ్బంది తో కలిసి పరిశీలించారు. మండలం లోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అదనంగా ఏమైనా ఏర్పాట్లు చేయాలా అన్న దానిపై ఆరా తీశారు. ఆయన వెంట ఆర్ఐ కిషోర్, వెల్ఫేర్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



గునుపాటి రాహుల్

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న గునుపాటి రాహుల్‌కు డాక్టరేట్ లభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్.వెంకట సుబ్బానాయుడు పర్యవేక్షణలో ఆర్‌పీ–హెచ్‌పీఎల్‌సీ పద్ధతిలో క్రిమిసంహారకాల విశ్లేషణ అనే అంశంలో పరిశోధనకు గాను రాహుల్ డాక్టరేట్ డిగ్రీ సాధించారు. రాహుల్‌ను పలువురు అభినందించారు.

9న జాతీయ లోక్ అదాలత్

నిడదవోలు : మార్చి తొమ్మిదో తేదీన నిడదవోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్ కోర్టులో రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ కోరారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఎక్కువ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి న్యాయవాదులు తమ వంతు సహకారం అందించాలన్నారు.

ఎయిడ్స్ నివారణపై కళాజాతా



ఆర్టీసీ డిపో వద్ద ప్రదర్శన చేస్తున్న కళాకారులు

నిడదవోలు: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ కళాజాతా నిర్వహించారు. మిరియాల రవిబాబు కళాజాతా బృందం సభ్యులు నాటక ప్రదర్శిస్తూ ఐసీటీసీ కేంద్రాల ఆవశ్యకత, మందుల ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి ప్రజలకు వివరించారు.

ఎమ్మెల్యేకి సత్కారం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

నిడదవోలు : పేదలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి కృషి చేసిన ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడుని గురువారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు బచ్చు లక్ష్మణరావు, ఆలమూరు రాజశేఖర్, మండ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నిడదవోలు రూరల్: కోరుమామిడి శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎస్ఎస్‌వీవీ రమేష్ గురువారం తెలిపారు. దేవరపల్లి మండలం ధూమంతునిగూడెం గ్రామానికి చెందిన మారిశెట్టి శ్రీనివాస్ మద్యం తరలిస్తుండగా అరెస్టు చేసి 36 క్వార్టర్‌బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రైతు నేస్తాలు ఆర్బీకేలు

- గ్రామాల్లోనే వ్యవసాయ సేవలు
- అందుబాటులో అన్ని సదుపాయాలు
- నిడదవోలు నియోజకవర్గంలో 62 కేంద్రాలు



పిట్టల వేమవరంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

పెరవలి: వ్యవసాయం అంటే దండగ కాదు పండగని ప్రభుత్వం నిరూపించింది. గత ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోకుండా వదిలేయడంతో రైతులు అగమ్యగోచరంలో పడ్డారు. ఆ సమయంలో ప్రస్తుతం ప్రభుత్వం రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టిలో పెట్టింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించింది. రైతు ముంగిటలోకి వ్యవసాయం సేవలు తీసుకొచ్చింది. విత్తనం నాటిన దగ్గర నుంచి విక్రయం వరకూ రైతులకు పూర్తి స్థాయిలో ఆర్బీకేలు సేవలందిస్తూ నేస్తాలా మారాయి.

లాభాలు ఇవే...

- ఆర్బీకే ఉద్యోగులు రైతులకు సరైన సూచనలిచ్చి అధిక దిగుబడి పొందేందుకు ఉపయోగపడుతున్నారు. ఆర్బీకేల్లో అన్ని సలహాలు, సూచనలు తీసుకోవచ్చు.
- ఆర్బీకేల్లో సబ్సిడీ నాన్ సబ్సిడీ విత్తనాలతో పాటు ఎరువులు, పురుగుమందులు అందజేస్తారు. కౌలు రైతులకు సీసీఆర్‌టీ కార్డులు (పంటసాగు హక్కు పత్రం) జారీ చేస్తారు.
- పంట నమోదు(ఈ క్రాఫ్ బుక్కింగ్) చేస్తారు. వైఎస్ఆర్ రైతు బరోసా నమోదు కూడ ఇక్కడే చేస్తున్నారు.
- పంట నమోదుతో బ్యాంకులకు వెళ్లకుండా, రుణాలు తీసుకోకుండా ఉచిత పంటల బీమాను నమోదు చేస్తారు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుండడంతో ఈ క్రాఫ్ బుకింగ్ అయితే పంటల బీమాకు అర్హత వస్తుంది.

నిడదవోలు నియోజక వర్గంలో	
ఆర్బీకేలు మొత్తం	62
ఒక్కో దాని నిర్మాణానికి రూ.21.80 లక్షల	
చొప్పున మొత్తం రూ.14కోట్లు మంజూరు	
పని చేసే ఉద్యోగుల సంఖ్య	62

- అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంట నష్టంపై సర్వే చేసి రైతులకు నెల రోజుల్లోపే పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటారు.
- వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి డ్రిఫ్, పశువుల దాణా, గడ్డి విత్తనాలతో పాటు యంత్రీకరణ పరికరాలు, యంత్రాలు తదితర ఏది కావాలన్నా ఆర్బీకే ద్వారానే ఆర్డర్ పెట్టాలి. రైతులకు అవసరమైతే సబ్సిడీ లేని, సబ్సిడీ ఉన్నవి ఆర్బీకే ద్వారా తెప్పిస్తారు.
- పంటలకు మద్దతు ధర లేనప్పుడు, కనీస మద్దతు ధరతో ధాన్యంతో పాటు అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు.
- ఇందులో ఉద్యోగి సెలవుపై వెళితే వీటి నిర్వహణ వలంటీరీకి అప్పగించి రైతులకు ఇబ్బంది లేకుండా వారి అవసరాలు తీరుస్తారు.
- ఆర్బీకే వ్యవస్థ దేశానికే ఆదర్శమైంది. వీటిని పలు రాష్ట్రాల్లో అమలు చేసేందుకు రాజస్తాన్, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాల ఉన్నతాధికారులు బృంధాలు ఏపిలోని పలు ఆర్బీకెలను పర్యవేక్షించాయి.

పల్లె ముంగిట్లో సర్కారు సేవలు



దమ్మెన్నులో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- దమ్మెన్నులో గడప గడపకూ మన ప్రభుత్వం

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజల ముంగిటలో ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. దమ్మెన్ను గ్రామంలో ఎస్సీ, బీసీ, ఓసీ ఏరియాల్లో సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటా పర్యటించి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఒక్కో కుటుంబానికి పథకాల వలన కలిగిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూనే, మరోపక్క అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. గత టీడీపీ హయంలో జన్మభూమి కమిటీ సభ్యులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయగా, వైఎస్సార్ సీపీ హయంలో వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల పాలనకు ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య గల తేడాను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, ఎంపీటీసీ సభ్యుడు గెడ్డం రామకృష్ణ, కోడవటి సూరిపండు, పెచ్చేటి నాగేశ్వరరావు, పసల సూరి, బి.అబ్బులు, ఎ.శివకుమార్, గెడ్డం జయపాల్, పంచాయతీ వైస్ ప్రసిడెంట్ గూడూరి వెంకటకృష్ణ, జుత్తిగ ఇషాక్, రాపాక వెంకటరత్నం, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- వేములూరులో గడప గడపకూ మన ప్రభుత్వం



వేములూరు జగనన్న కాలనీలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం వేములూరు జగనన్న కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ద్వారా అందించిన సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాస్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కొటికలపూడి అబ్రహాం లింకన్, తోట రామకృష్ణ, నామా ప్రకాశం, కొవ్వూరు పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, పలపాల సూర్యచంద్రం, వరిగేటి సుధాకర్, ఆరుగోలను చినరాజు, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, చీలి ప్రసాద్, కవల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజకుల చెరువు ఆక్రమణలు తొలగించాలి

జిల్లా సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య



రజకుల ఇబ్బందులు తెలుసుకుంటున్న కట్లయ్య

నల్లజర్ల: ఘంటావారిగూడెంలో రజకులకు కేటాయించిన ఊరచెరువు ఆక్రమణలు తొలగించి, బోరు, మోటారు సౌకర్యం కల్పించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజకజన సంఘ అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో పర్యటించిన ఆయన ఘంటావారిగూడెంలో సంఘస్తులతో సమావేశమయ్యారు. ఈనెల 26న ఏలూరులో రజకజన సంఘ సమావేశం జరుగుతుందని, అందరూ హాజరుకావాలని కట్లయ్య కోరారు. వివిధ సమస్యలపై ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా సంఘ కార్యదర్శి జువ్వలపాలెపు అన్నవరం, రజక సంఘ జిల్లా నాయకులు విఠాల్ శ్రీనివాస్, కొమ్మంటి మురళీ, సుబ్బయ్య, లక్ష్మీప్రసన్న, మడిచర్ల నాగేశ్వరావు, రాచూరి నాగేశ్వరావు, సత్యనారాయణ, గోవ్వాడ నాగేశ్వరావు, వెంకట్రావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి



రాజమహేంద్రవరంలో గూడూరి శ్రీనివాసరావు భార్య రాధికను మర్యాద పూర్వకంగా కలిసిన కాపు జేఏసీ నాయకులు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ నుంచి రాజమహేంద్రవరం ఎంపీగా గూడూరి శ్రీనివాసరావును, కొవ్వూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా తలారి వెంకటరావులను భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని పెద్దేవంకు చెందిన సీనియర్ నాయకులు, కాపు జేఏసీ రాష్ట్ర నాయకులు తోట రామకృష్ణ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ కార్యాలయంలో మండల నాయకులు తరలివెళ్లారు. ఆయనతోపాటు జిల్లా జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, స్టేట్ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ వైస్ చైర్మన్ పిల్లి నిర్మల తదితరులు గూడూరి శ్రీనివాస్ భార్య గూడూరి రాధికను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీకి కాపు సంఘాల తరుపున మద్దతు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



అధికారులతో మాట్లాడుతున్న గంగాధరరావు

నల్లజర్ల: మార్చి 3వ తేదీన జరుగనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేద్దామని పీహెచ్‌సీ డాక్టరు తెల్లం గంగాధరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో బూత్‌ల ఏర్పాటు, ఐదేళ్లలోపు చిన్నారులందరికీ వ్యాక్సిన్ అందించే ఏర్పాటు, హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు, రవాణా సౌకర్యం, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు నియామకం, ముందస్తు అవగాహన కార్యక్రమం తదతర అంశాలపై చర్చించారు. పల్స్ పోలియో వ్యాక్సిన్‌కు సంబంధించి వ్యాక్సిన్ కేరియర్లు, ఐస్ ప్యాక్స్‌కు ఎటువంటి కొరత లేకుండా చూడాలని డిప్యూటీ తహసీల్దారు కిశోర్‌కుమార్ సూచించారు. సమావేశంలో సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, ఎంఈఓ–1 వై.సత్యనారాయణ, ఎంఈఓ–2 భగవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎం.హారతి, వీఆర్వో లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు నేడు పురస్కారాల ప్రదానం



ఎల్లే సుచిత్ర (విజ్జేశ్వరం)

నిడదవోలు రూరల్: మండలంలోని 22 సచివాలయాల పరిధిలోని వలంటీర్లకు శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ జేఏ ఝాన్సీ గురువారం తెలిపారు. నిడదవోలు కాపు కల్యాణ మండపంలో శుక్రవారం 10 గంటలకు జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. సేవా వజ్ర పురస్కారానికి టి.దుర్గా చంద్రకళ (శెట్టిపేట), శనక్కాయల సత్య(విజ్జేశ్వరం), సేవా రత్న పురస్కారాలకు సింగులూరి ఆంజనేయులు (పెండ్యాల), కొమ్మన కోటేశ్వరి(మునిపల్లి), ముప్పిడి చిన్నారి(పెండ్యాల), కోరశిక గంగాభవాని (తాడిమళ్ల–2), ఎల్లే సుచిత్ర (విజ్జేశ్వరం)తో పాటు మరో 309 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు.

వరుసగా మూడేళ్ల అవార్డులు

ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున అవ్వాతాతాలకు గుడ్‌మార్నింగ్ చెప్పి పింఛన్ డబ్బులతో సహా 35 రకాల సేవలను లబ్ధిదారుల ముంగిటకు చేరవేస్తున్న వలంటీర్లను ప్రభుత్వం గుర్తించి సత్కరిస్తోంది. నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామానికి చెందిన వలంటీర్ ఎల్లే సుచిత్ర వరుసగా మూడో ఏడాది ఈ పురస్కారానికి ఎంపికైంది. కరోనా మహమ్మారి సమయంలో సైతం ప్రజలను ఆదుకోవడం, దిశ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ అమలులో భాగంగా ఎప్పుడు ఏ పథకం వస్తుందో ప్రజలకు దగ్గరగా వెళ్లి వివరించడంలో సుచిత్ర ప్రశంసలు అందుకుంది. దీంతో 2021–22 సేవా వజ్ర, 2022–23 సేవా రత్న, 2023–24 సేవా రత్న పురస్కారాలు వరించాయి.

త్వరలో డయాలసిస్ సేవలు తీసుకువస్తాం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఏరియా ఆసుపత్రికి భూమిపూజ



ఆసుపత్రి నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పేద వర్గాలకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో రూ.19 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించడమే కాకుండా అదనంగా ఆక్సిజన్, డిజిటల్ ఎక్స్‌రే, డెంటల్ సేవలు, బ్లడ్ బ్యాంకు, ఆధునిక లేబరేటరీ ఏర్పాటు చేశామన్నారు. పూర్తి స్థాయి డాక్టర్ల నియామకం, సదుపాయాల కల్పించడంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగిన విషయాన్ని గతేడాది కాపు నేస్తం నిధుల విడుదలకు నిడదవోలు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి రూ.19 కోట్ల మంజూరు చేశారన్నారు. ఆయనకు ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో డయాలిసిస్ సదుపాయం కూడా అందుబాటులో తీసుకువస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. పట్టణంలో రూ. 91లక్షలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, తాడిమళ్ల గ్రామంలో సుమారు రూ.1.76 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మించామన్నారు. నియోజకవర్గంలో రూ. 9.10 కోట్ల వ్యయంతో ప్రతి గ్రామంలో ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను నిర్మిస్తున్నామన్నారు. పెరవలి, కానూరు, సమిశ్రగూడెం, ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రూ.1.09 కోట్ల వ్యయంతో నాడు–నేడు పథకంలో అభివృద్ధి చేశామన్నారు. ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో బ్లాక్ లెవెల్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మిస్తున్నామన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేశారనడానికి ఇదే నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ కె.సనత్‌కుమారి, ఎంపీపీ తిరుమల భాగ్యలక్ష్మి, ఆసుపత్రి సూపరిండింటెంట్ ఏవీ ఆర్ఎస్ తాతారావు, ఈఈ వై.రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్ గుర్రం శాంతిశ్రీ, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు ముంగండి కృపానందం, అయినీడి పల్లారావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గుర్రం జేమ్స్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్ష నేతల కల్లబొల్లి మాటలు నమ్మవద్దు

- జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్
- రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: ఎన్నికల వేళ కల్లబొల్లి మాటలు చెప్పే ప్రతిపక్ష నాయకులను నమ్మి మోసపోవద్దని, రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే జగనన్న మరోసారి సీఎం కావాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని గొడుగుపేట, జి.కొత్తపల్లి, సీహెచ్ పోతేపల్లి, మద్దులగూడెం, సాయన్నపాలెం, కోడిగూడెం, కొత్తగూడెం, రామసింగవరం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆమె ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశాలను నిర్వహించారు. అందులో భాగంగా జి.కొత్తపల్లికి విచ్చేసిన ఆమె ముందుగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి వనిత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గారపాటి రమప్రభ, మండల అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

కొవ్వూరు: విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ ఏవిధంగా శిక్షణ అందించాలో టోఫెల్ ఎందుకు అమలు చేయాలో ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు. గత రెండు రోజులుగా కొవ్వూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతులకు డివిజన్ పరిధిలో తొమ్మిది మండలాల ఉపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్లు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు, డీవైఈవో నారాయణ, ఏఎంఓ గౌరీశంకర్, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొవ్వూరు: ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు శుక్రవారం వేములూరు గ్రామంలో ఉదయం తొమ్మిది గంటలకు జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ప్రారంభించనున్నారు. 11 గంటలకు చాగల్లు మండలం నెలటూరులో పాలవెల్లువ పథకం ప్రారంభం, అనంతరం నందిగంపాడులో నూతన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి పశివేదల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు.

విద్యార్థులకు అభినందనలు

నిడదవోలు : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, కోరుమామిడి ప్రభుత్వ హైస్కూళ్లలో నిడదవోలు మానవత ఆధ్వర్యంలో గురువారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రంతో పాటు నగదు బహుమతులు అందించి అభినందించారు. పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అట్టలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మానవత అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు, కాజ గంగరాజు, వున్నమట్ల లీలాలక్ష్మి, సత్యభాస్కర ప్రసాద్, గెడా రామచంద్రరావు, దారపురెడ్డి సూర్యచంద్రరావు, తన్నీడి బోసు, కొప్పుల వెంకటేశ్వరరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, పెనుగొండ సుబ్బారాయుడు, నీలం రామారావు, పాతూరి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కడియం: మండల కేంద్రమైన కడియం నుంచి బుర్రిలంక మీదుగా జాతీయ రహదారికి వెళ్లేందుకు ఉపయోగపడే సీసీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.2.65 కోట్ల మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఈ పనులను మంత్రి వేణు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, నర్సరీ రైతులు పాల్గొన్నారు.